క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఈఎస్‌ఐ, బేగంపేట సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఐఏఎస్ క్వార్టర్స్ ఫీడర్ పరిధిలోని శ్రీనివాసకాలనీ ఈస్ట్, 2ఆర్‌టీ, ఎస్ఆర్‌నగర్ బస్టాప్ వెనుక ప్రాంతం, గాయత్రీనగర్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ నివాస ప్రాంతం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గవర్నమెంట్ హాస్పిటల్ ఫీడర్ పరిధిలోని నేచర్‌క్యూర్ హాస్పిటల్ ఎదురు లైన్, బల్కంపేట ఎస్‌బీఐ మెయిన్‌రోడ్డు, ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఏరియా, కమ్యూనిటీ హాల్ ఎదురు ప్రాంతం, అభిరుచి స్వీట్ హోమ్స్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 18, పాడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 32, పందిరి బీర 40, క్యాబేజీ 15, క్యారెట్ 28, దొండ 23, గుండుబీన్స్ 135, గింజ చిక్కుడు 50, గోకరకాయ 50, కీర 15, దోసకాయ 15, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 10, ఆలుగడ్డ 19, చామగడ్డ 35, మొరంగడ్డ 21, కందగడ్డ 40, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

పేదలకు చేయూతనివ్వాలి



మాట్లాడుతున్న సారా

అడ్డగుట్ట: నిరుపేద ప్రజలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సెవెన్ రేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ సారా అన్నారు. గురువారం సింగరేణి స్లమ్ ప్రాంతంలో నివసించే పేద విద్యార్థినులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శానిటరీ ప్యాడ్స్, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరంలో అనేక స్లమ్ ప్రాంతాలు ఉన్నాయని, అందులో వేల సంఖ్యల్లో పేద ప్రజలు జీవిస్తున్నారని వారందరికీ తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సనత్‌నగర్: ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవడంతో పాటు వాటిని పాటించాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. గురువారం బేగంపేటలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపరాదని, మితిమీరిన వేగంగా వెళ్లరాదన్నారు. కారులో సీటు బెల్ట్ లేకుండా ప్రయాణించకూడదని సిగ్నల్ జంప్ ప్రమాదకరమని, అలాగే జీబ్రా క్రాసింగ్ వద్ద స్టాప్‌లైన్ ముందు వాహనాలు నిలపాలన్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్లేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని, ఇచ్చిన వారిపై కూడా కేసులు నమోదు చేసే అధికారం పోలీసులకు ఉందన్నారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు హెడ్‌కానిస్టేబుల్ వీరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్టాటిస్టిక్స్ పాత్ర కీలకం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మానవ దైనందిన జీవితంలో స్టాటిస్టిక్స్ పాత్ర కీలకమని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ యుగేందర్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిగ్రీ కళాశాలలో స్టాటిస్టిక్స్ విభాగం జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా యుగేందర్ మాట్లాడుతూ... ఆధునిక యుగంలో స్టాటిస్టిక్స్ లేకుండా ఏ ఆర్థిక లావాదేవీలూ జరగడం లేదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అనేక వ్యాపార లావాదేవీల్లో స్టాటిస్టిక్స్‌ను ఉపయోగిస్తున్నారని తెలిపారు. నీతి ఆయోగ్, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ నివేదికలు, జనాభా గణన డేటా అనాలసిస్‌లో కూడా స్టాటిస్టిక్స్ పాత్ర ఎంతో ఉందన్నారు. అంబేడ్కర్ విద్యా సంస్థల డైరెక్టర్ రిషికాంత్, డాక్టర్ ఎస్.సుభాని, కళాశాల కార్యదర్శి వినోద్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

నల్లకుంట: శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ఆధ్వర్యంలో గురువారం బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద పేదలకు అన్నదానం చేశారు. ముందుగా సాయిబాబాకు అభిషేకం చేసి బాబాకు హారతి ఇచ్చారు. ఉదయం ఐదు వందల మందికి, మధ్యాహ్నం ఐదు వందల మంది పేదలకు అన్నదానం చేశారు.

అభివృద్ధిలో ఆదర్శం తెలంగాణ



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్



మంత్రిని సన్మానించిన నూతన కమిటీ సభ్యులు

రాంగోపాల్‌పేట్: అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించడంలో అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం సికింద్రాబాద్‌లోని తేరాపంత్ భవన్‌లో నిర్వహించిన ఆచార్య మహాశ్రమన్ 50వ దీక్షా దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని విద్య, వ్యాపారం, ఉద్యోగాల్లో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. వ్యాపారులు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారని జైన సమాజ్ ఆధ్వర్యంలో చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. పేద, మధ్య తరగతి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టి ఆర్థికంగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మమత సంతోష్ గుప్తా, నిర్వాహకులు బాబూలాల్ బైద్, సుశీల్ సంచటి, హిమాన్షు పాల్గొన్నారు.

8న మహంకాళి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం..

సనత్‌నగర్: సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి ఆలయ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం ఈ నెల 8న నిర్వహించనున్నట్లు మంత్రి తలసాని తెలిపారు. నూతనంగా నియమితులైన ఆలయ కమిటీ సభ్యులు గురువారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలువగా శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రమాణ స్వీకారానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మంత్రిని కలిసిన వారిలో మహేష్, కిషోర్, లావణ్య, కృష్ణ, జగదీష్, ప్రసాద్‌వర్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ నర్సింగ్ స్టాఫ్ జీతాలు పెంచాలి



ఈఎస్‌ఐ డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

బన్సీలాల్‌పేట్: ఈఎస్‌ఐలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ నర్సింగ్ స్టాఫ్ జీతాలు రాష్ట్ర ప్రభుత్వ సిబ్బందితో సమానంగా పెంచాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఈఎస్‌ఐ డైరెక్టరేట్ కార్యాలయం ముందు గురువారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఈఎస్‌ఐ విభాగం(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ. యూసుఫ్, ఎం.నరసింహ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ నర్సింగ్ సిబ్బందికి రూ. 32,368 చెల్లిస్తుండగా ఈఎస్‌ఐ సిబ్బందికి మాత్రం రూ. 22,750 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈఎస్‌ఐ డైరెక్టర్, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నర్సింగ్ సిబ్బందికి జీతాలు పెరగకుండా ఉన్నాయన్నారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17 నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో 35 క్యాజువల్ లీవ్‌లు అమలు చేస్తుండగా ఈఎస్‌ఐలో మాత్రం 23 లీవ్‌లు ఇస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ జీవో జారీ చేసి రెండు సంవత్సరాలు కావస్తున్నా అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. జీతాలు పెంచాలనే డిమాండ్‌పై నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెంకటరాజ్యం, కిషన్, నర్సింగ్ సిబ్బంది నాగమణి, మేరీ, సుమలత, కళ్యాణి, మంగమ్మ, స్వామి, మహేశ్వరీలతో పాటు అనేక మంది పాల్గొన్నారు. అనంతరం సమ్మె నోటీసును అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీకి అందజేశారు.

మౌనిక కుటుంబానికి అండగా ఉంటాం



ఆర్థిక సాయం అందజేస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర

రాంగోపాల్‌పేట్: ఇటీవల నాలాలో పడి చనిపోయిన కళాసీగూడకు చెందిన మౌనిక కుటుంబానికి తాము అండగా ఉంటామని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. గురువారం మౌనిక కుటుంబ సభ్యులకు కార్పొరేటర్ సొంత నిధుల నుంచి రూ.51 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని వేళలా తాము అండగా ఉంటామని ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మౌనిక విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, జీహెచ్ఎంసీ అధికారుల అలసత్వం బట్టబయలు అయిందన్నారు. ప్రభుత్వం మౌనిక కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి నష్టపరిహారం అందించేందుకు తాము కృషి చేస్తామన్నారు.

◆ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ కళాసీగూడలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, మంచినీటి సమస్యల గురించి స్థానిక ప్రజలు ఆమె దృష్టికి తెచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బహిరంగ సభకు తరలిరావాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 8న నిర్వహించనున్న విద్యార్థి, నిరుద్యోగ భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున విద్యార్థులు కదిలిరావాలని తెలంగాణ విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ వరంగల్ రవి కోరారు. గురువారం ఓయూలో తెలంగాణ వర్సిటీలకు వివిధ విద్యార్థి సంఘాల ముఖ్యనాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు.

మధుశ్రీకి డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలోని ఇన్ఫర్మేటిక్స్ టెక్నాలజీ విభాగం నుంచి జి.మధుశ్రీకి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. వరంగల్ పట్టణానికి చెందిన మధుశ్రీ పీజీ వరకు కేయూలో చదివి, జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అనంతరం ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో పీహెచ్‌డీలో ప్రవేశం పొంది ఎస్ఆర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.గురురావు పర్యవేక్షణలో కంట్రోలింగ్ ఐపీ ఫాల్సిఫ్లయింగ్ యూజింగ్ రీలిస్టిక్ సిములేషన్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. కాకతీయ యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకురాలిగా పని చేస్తున్న మధుశ్రీ తన పీహెచ్‌డీ పరిశోధనకు సహకరించిన ప్రొ.శ్యామల, బీవోఎస్ వెంకటదాస్, డీన్ ప్రొ.పీవీ.సుధాకు ధన్యావాదలు తెలిపారు.

‘కేంద్ర, రాష్ట్రాల్లో బీజేపీ విజయం ఖాయం’



గోడపై కమలం గుర్తును వేస్తున్న నాయకులు

బౌద్ధనగర్: రానున్న ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలోనూ బీజేపీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం బౌద్ధనగర్ డివిజన్‌లో ప్రతీ బూత్‌లో ఇంటింటికీ కమలం గుర్తును వేసి బీజేపీకి ఓటు వేయాలని వాల్ రైటింగ్ చేయించారు. ఈ సందర్భంగా శ్యాం సుందర్ గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి అక్రమాలు, కుటుంబ పాలనలో మునిగిపోయిందన్నారు. ప్రజలు, వారి సమస్యలను పక్కదారి పట్టించి జతీయస్థాయిలో బీఆర్ఎస్ పార్టీని స్థాపించి తుగ్లక్ పాలనను తలపిస్తున్నాయన్నారు. తెలంగాణ ప్రజలు ఈసారి కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు. నియోజకవర్గంలో ఏమాత్రం అభివృద్ధి జరగలేదని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ఆరోపించారు. ప్రతీ ఇంటి గోడపై వాల్ రైటింగ్ చేసి ప్రజలందరినీ చైతన్యవంతం చేసి డబుల్ ఇంజన్ సర్కార్‌కు అవకాశం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సారంగపాణి, హనుమంత్ ముదిరాజ్, రాచమల్ల కృష్ణమూర్తి, ప్రకాష్ గౌడ్, మేకల కీర్తి, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, సాయిదత్తు, రాజ్‌కుమార్, వనమాల కిరణ్, వాణి రాజ్ పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం సరఫరా చేస్తే చర్యలు తప్పవు



ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న సీఐ నవనీత

రాంగోపాల్‌పేట్: ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని అక్రమంగా సరఫరా చేయడం నేరమని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సికింద్రాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నవనీత తెలిపారు. గురువారం సిబ్బందితో కలిసి ఆమె రాణిగంజ్, మినిస్టర్‌రోడ్, నల్లగుట్ట తదితర ప్రాంతాల్లోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. ట్రాన్స్‌పోర్టు వాహనాల ద్వారా ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సుంకం చెల్లించని మద్యం సరఫరా చేస్తున్నారనే సమాచారంతో ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టామని ఇలాంటి మద్యం సరఫరాకు సహకరించిన వాహనాలను సీజ్ చేసి సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అన్ని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల వద్ద ప్రత్యేకంగా తమ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామని పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రసూల్‌పురా: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కార్ఖాన ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం .. వెల్లింగ్‌టన్ రోడ్ ఫ్లాట్ నంబర్ సమీపంలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు డయల్ 100 కు ఫోన్ రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా 38 సంవత్సరాల వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. పోలీసులు స్థానికంగా విచారణ చేయగా గత నాలుగేళ్లుగా బిక్షాటన చేస్తున్నారని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌డీ ఫీజులు తగ్గించాలని నిరసన



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజు పెంపుపై నిరసనలు కొనసాగుతున్నాయి. గురువారం క్యాంపస్‌లోని న్యాయ కళాశాల ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తూ నిరసన తెలిపారు. ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు పీహెచ్‌డీ అడ్మిషన్లు రద్దు చేసుకుంటున్నారని పెంచిన ఫీజును ఉపసంహరించుకోవాలని వీసీ ప్రొ.రవీందర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లి సత్య, ఆజాద్, అఖిల్, స్వరాజ్, మధు, మహేష్, వెంకట్, గోవర్ధన్, రవి పాల్గొన్నారు.

నేడు శంకరమఠంలో సామూహిక సంకీర్తనార్చన

నల్లకుంట: వాగ్గేయ కారుడు శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 615వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ విద్యార్థులచే ‘నవరత్నమాల’ శీర్షికన సామూహిక సంకీర్తనార్చనలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధా మూర్తి తెలిపారు. శుక్రవారం సాయంత్రం నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో ఆలిండియా రేడియో, దూరదర్శన్ కళాకారుడు గౌరీభట్ల లక్షణ మూర్తి స్వీయ శిక్షణలో సుమారు వంద మంది విద్యార్థులచే అన్నమయ్యకు సామూహిక సంకీర్తనార్చన ఉంటుందన్నారు. 6వ తేదీన ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత మన్నార్ రంగనాయక స్వామి ఆలయంలో, 7వ తేదీన పాలెం క్షేత్రం కూర్మగిరి శ్రీసుందర లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో సంకీర్తనల గానం ఉంటుందన్నారు. సంకీర్తనార్చనలో పాల్గొనే వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామన్నారు. దీనికి ఈవెంట్ మేనేజర్లుగా నందిని, యామిని, సింధులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. సంగీతాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ సంకీర్తనార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వసుధా మూర్తి కోరారు.

మూసీ కాలుష్య నివారణకు సహకరించాలి



మాట్లాడుతున్న వెంకటదాస్, పిట్ల నాగేష్

రసూల్‌పురా: మూసీ కాలుష్యం కారణంగా పరివాహక ప్రాంత జీవరాసుల మనుగడ, జంటనగర వాసుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని సొసైటీ ఫర్ ఎర్త్ జస్టిస్ చైర్మన్ ఓయూ ప్రొఫెసర్ వెంకటదాస్, అధ్యక్షులు పిట్ల నాగేష్ ముదిరాజ్ అన్నారు. మూసీ కాలుష్యం కారణంగా తలెత్తుతున్న అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కంటోన్మెంట్ బాలంరాయి నుంచి రసూల్‌పురా వరకు గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూసీ వ్యర్థ జలాలను ఉపయోగించి ఆకు కూరలు, కూరగాయలు పండిస్తున్నారని దీంతో ప్రజలు వాటిని కొనుగోలు చేసి తింటూ ప్రమాదకరమైన కేన్సర్ బారిన పడుతున్నారని ఆరోపించారు. అదే విధంగా కాలుష్య జలాలతో గడ్డిని పెంచి డైరీలకు సరఫరా చేయడంతో గేదెలు, ఆవులు వాటిని తిని రసాయనాలతో కూడిన పాలను ఇస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ కాలుష్య ప్రక్షాళన నివారణ పోరాటానికి ప్రతి ఒక్కరు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రాజీవ్‌రావు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ధనలక్ష్మి, దుర్గా భవాని, సుమలత, రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న షటిల్ టోర్నమెంట్‌కు ఏర్పాట్లు ముమ్మరం

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర తొలి హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి జయంతి వేడుకల్లో భాగంగా నాయిని నర్సింహారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన పార్సిగుట్ట సమీపంలోని అడిక్‌మెట్ జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ స్టేడియంలో షటిల్ టోర్నమెంట్–2 పోటీలను నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు వి.సమతారెడ్డి, వి.శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నాయిని దేవేందర్‌రెడ్డి వెల్లడించారు. గురువారం ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లను ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నాయిని దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ షటిల్ పోటీలలో విజేతలలో మొదటి బహుమతిగా రూ. పది వేలు, ద్వితీయ బహుమతిగా రూ. ఐదు వేలు, మహిళా జట్లకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ బహుమతుల ప్రదానోత్సవానికి నేషనల్ హ్యాండ్‌బాల్ అంబాసిడర్, మిస్ ఏసియా రక్సీమీ ఠాకూర్, బిగ్‌బాస్ ఫేం, సన్నీ, నేషనల్ వాలీబాల్ ప్లేయర్ శ్రీలత, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు తదితరులు హాజరవుతారన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే ఔత్సాహిక క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్: 97053 47212లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బిజ్జి వెంకటేశ్వరరావు, ప్రవీణ్, కార్తీక్‌యాదవ్, సిద్ధిఖి, నాయిని పృథ్వీరెడ్డి, పాండు, అంజి, సాయి తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

అడ్డగుట్ట: బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 7న నిర్వహించనున్న తెలంగాణ భరోసా బహిరంగ సభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు సునీల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం తుకారాంగేట్‌లో బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సరూర్‌నగర్ స్టేడియం విద్యార్థి అమరవీరుల ప్రాంగణంలో ఈ నెల 7న సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న సభకు ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి మాయావతి హాజరవుతారని ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. బీఎస్పీ నేతలు నంద కుమార్, నర్సింగ్‌రావు, సుమలత, హఫీజ్ ఖాన్, విజయలక్ష్మి, దేవమ్మ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు షురూ



పనులను ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ రవీందర్

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని అడ్వకేట్ కాలనీలో ఆరు నెలల క్రితం డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణం కోసం తీసిన గొయ్యిలతో పాటు రోడ్డు ప్యాచ్ వర్క్స్ పనులు చేపట్టకపోవడంతో తరచూ ద్విచక్ర వాహనాదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ క్రమంలో కాలనీ వాసులు ఇబ్బందులను గమనించిన మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి.రవీందర్ ప్రత్యేక చొరవ తీసుకొని జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్ లింగం, రాములతో కలిసి గురువారం రోడ్డు ప్యాచ్‌వర్క్స్ పనులకు శ్రీకారం చుట్టారు. ఆరు నెలల క్రితం రూ. 13 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను చేపట్టిన విషయం తెలిసిందే. డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తయినప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్డు గుంతలమయమై తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులకు విన్నవించి ప్యాచ్ వర్క్ పనులను చేయించి ప్రజల ఇబ్బందులను తొలగించడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కళాకారులు చిరస్మరణీయులు

ఆచార్య కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి: కళాకారులకు జన్మదినం మాత్రమే ఉంటాయని వారి కళల వల్ల చిరస్మరణీయంగా సమాజంలో నిలిచి ఉంటారని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. గురువారం త్యాగరాయగాన సభలో శ్రుతిలయ ఆర్ట్స్ అకాడమీ, ఆర్.ఆర్.ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో యువ కళావాహిణి సాంస్కృతిక సంస్థ స్థాపకుడు వై.కె.నాగేశ్వర్‌రావు, ప్రముఖ గాయకుడు వెంకటరావుల సంస్మరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇనాక్ మాట్లాడుతూ... వై.కె.నాగేశ్వర్‌రావు సంస్థ స్థాపించి ఎందరో కళాకారులను ప్రోత్సాహించిన గొప్ప రంగస్థల నటుడన్నారు. ఈ సందర్భంగా వై.కె.శ్రమశక్తి పురస్కారాలు ఆనందరాజు, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్‌గౌడ్‌కు వెంకటరావు, పురస్కారాలు సుభాష్, సీతారామయ్య, బాలకామేశ్వర రావు తదితరులకు అందజేశారు. విదేసాంధ్రుడు డాక్టర్ జగదీష్ యలమంచిలికి ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డుతో అతిథులు సత్కరించారు. సాహితీవేత్త వోలేటి పార్వతీశం అధ్యక్షత వహించిన సభలో వంశీరామరాజు, రఫీ, లంక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. సంస్థ కార్యదర్శి అమని నిర్వహణలో గాయనీ గాయకులు పలు సినీగీతాలతో సభికులను ఆకట్టుకున్నారు.

నష్టపరిహారం కోరడం నేరమా?

ముషీరాబాద్: అకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం కోరడం నేరమా అని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాయల చంద్రశేఖర్, వి.ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఎస్‌వీకే వద్ద ప్రొఫెసర్ కోదండరాం, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి మురళీ, కె.రవిలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రబీ సీజన్ ప్రారంభం నుంచి ప్రకృతి పంటలపైన తన ప్రతాపం చూపుతూనే ఉందన్నారు. మార్చిలో అకాల వర్షంతో వరి పంట, మొక్కజొన్న, నువ్వులు, సజ్జ, వ్యవసాయ మార్కెట్లో మిర్చి, పసుపు తదితర పంటలు నష్టపోయాయి. ఈ నష్టాన్ని పరిశీలించడానికి ముఖ్యమంత్రి స్వయానా రెండు జిల్లాలు పర్యటించి తాత్కలిక సహాయం కింద ఎకరాకు పది వేల రూపాయలు రైతులకు ఇస్తున్నట్లు ప్రకటించి ఇవ్వకపోవడం దారుణమన్నారు. రైతులకు నష్టపరిహారం అందించాలని కోరుతూ సచివాలయానికి బయలుదేరిన నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రశ్నించే హక్కు సైతం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379